

పోలీసు వృత్తికి గౌరవం తేవాలి



కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ గిరిధర్

కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీసు వృతికి గౌరవం తీసుకు రావాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సై చాంబర్‌లో పోలీసులతో మాట్లాడుతూ చట్టాన్ని అమలు చేస్తూ ఆదర్శంగా నిలువాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి సీసీ కెమెరాలను అమర్చుకోవడానికి ప్రజలను చైతన్యనం చేయాలన్నారు. 100 డయల్ కాల్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి సిబ్బంది చేరుకోని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య తాగే వారిపై కేసు నమోదు చేయాలన్నారు. అంతకు ముందు స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి సీఐ శివ కుమార్, ఎస్సై మంజునాథ్‌రెడ్డి ఉన్నారు.

అంతస్తుల్లో అనుబంధాలు..

- ఎక్కడెక్కడి వారినో కలిపే అపార్ట్‌మెంట్లు
- భిన్న వర్గాల వారు ఒక్క చోటనే జీవనం
- ఆపద సమయాల్లో ఒకరికొకరు అండ
- అందరూ ఒక్కటై ఉత్సవాలు, పండుగలు



వివరాలు 6వ పేజీలో...

భారత్‌మాల నిర్వాసితుల ధర్నా



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత్‌మాల రోడ్డుకు సంబంధించి రెండవ విడత భూ నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితులు మంగళవారం గద్వాల కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు నారాయణ మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండల కేంద్రంలో దాదాపు 99 ఎకరాల భూములను భారత్‌మాలలో కోల్పోయినట్లు చెప్పారు. ఏడాది క్రితం మొదటి విడత నష్టపరిహారంలో భాగంగా ఎకరాకు రూ.16 లక్షలు చెల్లించారని, అయితే అయిజ మండల పరిధిలో భూములకు డిమాండ్ ఉండటంతో రెండవ విడత నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయిజ మండలంలోని ఇతర గ్రామాల రైతులకు రెండో విడత నష్టపరిహారం చెల్లించినా తమకు ఇవ్వలేదన్నారు. తమకు రెండవ విడత నష్టపరిహారం అందించే వరకు ఉద్యమిస్తామని చెప్పారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు చర్యలు

● కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల ద్వారా 2018-19లో మంజూరైన సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్‌తో ఇప్పటి వరకు రుణాలు ఇవ్వకపోవడానికి గల కారణాలపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో శాఖ ద్వారా సంవత్సరం వారీగా స్వయం ఉపాధికి మంజూరు అయిన రుణాలు, లబ్ధిదారులకు అందిన రుణాల వివరాలు, మిగిలిపోయిన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరైనా కేవలం 20 శాతం రుణం ఇవ్వడానికి ఇంత ఆలస్యం ఎందుకని లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించారు. కారణాలు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని సంక్షేమ శాఖల అధికారులను, లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా తీసుకొని మండల అభివృద్ధి అధికారులు రుణాల మంజూరుకు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ ఉమాదేవి, జడ్పీ సీఈవో యాదయ్య, ఆర్డీవో పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

● కలెక్టర్ బీఎం. సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం. సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ బీఎం.సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఎంపికైనా ఉపాధ్యాయులకు ప్రాధాన్యత క్రమంలో అవసరమైన పాఠశాలలకు కేటాయిస్తామన్నారు. మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ పద్ధతిలో పూర్తి పారదర్శకతతో కేటాయింపులు నిర్వహించామని తెలిపారు. ఇప్పటికే నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధులకు హాజరు కావాలన్నారు. కేటాయింపులు అనంతరం ఎలాంటి సిఫారసులకు తావులేదని, తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉపాధ్యాయులందరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీసీఈవో కాంతమ్మ ఉన్నారు.



కుడి కాలువకు నీటిని ఎత్తిపోస్తున్న మోటార్లు

ఇంకెన్నాళ్లు ఎత్తిపోతలు

- నిండుకుండలా శంకర సముద్రం రిజర్వాయర్
- కుడి కాలువ ఆయకట్టుకు అందని సాగునీరు
- ఖరీఫ్, యాసంగి సీజన్‌లలో ఇబ్బంది పడుతున్న రైతులు
- శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్న అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీమా ప్రాజెక్టులో అంతర్భాగమైన శంకర సముద్రం రిజర్వాయర్ నిర్మాణంతో 90 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కుడి కాలువ పరిధిలోని అయిదు మండలాల్లో 26 వేల ఎకరాలు, ఎడమ కాలువతో నాలుగు మండలాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్దేశించి నిర్మాణాలు చేశారు. రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా ఉండడంతో కుడి కాలువకు గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు నీరు అందించలేని దుస్థితి నెలకొన్నది. బీమా నీటితో రిజర్వాయర్ పాతలెవెల్ వరకు నింపి రింగ్‌బండ్ సాయంతో ఎడమ కాలువకు నీరు అందించడంతో కుడి కాలువ పరిధిలోని 13 గ్రామాల రైతుల్లో నిరసన జ్వాలలు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని సద్దుమనిగించడం కోసం 10 హెచ్‌పీ సామర్థ్యం గల పది మోటార్లతో నీటిని ఎత్తిపోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఐదేళ్లుగా మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నారే కానీ గ్రావిటీ ద్వారా నీరు అందించడానికి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రుల పర్యటనతో పరిష్కారం అయ్యేనా ..

పెండింగ్ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా సెప్టెంబరు 30న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. పెండింగ్‌కు గల కారణాలు నీటిపారుదలశాఖ రాష్ట్ర అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, 300 ఇళ్ల వారిని పునరావానికి తరలించి కరకట్ట నిర్మాణం చేపట్టాలని అధికారులు సూచించారు. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంత్రుల దృష్టికి తెచ్చారు. పర్యటన ముగిసి పక్షం రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నాలుగు గ్రామాలకే ఎత్తిపోతల నీళ్లు ..

శంకర సముద్రం రిజర్వాయర్ కుడి కాలువకు ఎత్తిపోతల ద్వారా అందిస్తున్న సాగునీరు నాలుగు గ్రామాలకే అందుతోంది. ఈ కాలువ పరిధిలో కొత్తకోట, అడ్డాకుల మండలాల్లో నాలుగు గ్రామాల చొప్పున పెద్దమందడి, కొకుంట్ల, మదనాపురం మండలాల్లో మొత్తం 14 గ్రామాలు ఉన్నాయి. ఆయకట్టు మొత్తానికి నీరు ఇవ్వాలని పది పెద్ద మోటార్లతో నీటిని ఎత్తిపోయడానికి ప్రయత్నం చేశారు. మోటార్లు సక్రమంగా నడవకపోవడంతో కొత్తకోట మండలంలోని నిర్వేన్, పాలెం, కనిమెట్ట, రామనంతపూర్ గ్రామాల రైతులు మాత్రమే నీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు.

మోటార్లు ఎత్తిపోయడంతో వస్తున్న నీటి కోసం రైతులు పడరాని పట్లు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సందర్భంలో కాలువలకు మరమ్మతులు చేసుకుంటున్నారు. కాలువ వెంట వచ్చే నీరు పారించేందుకు వంతుల వారిగా రాత్రివేళ శివరాత్రి జాగరణ చేస్తున్నారు.

కాలువ వెంట పుష్కలంగా నీరు రాదు ..



మోటార్లు నీటిని ఎత్తిపోస్తున్నా కాలువవెంట నీరు పుష్కలంగా రావడం లేదు. మొదట ఉన్న రైతులు పొలాలకు నీరు పెట్టుకున్న తర్వాతే మాకు వస్తాయి. ఖరీఫ్‌లో వరి పంటలకు నీళ్లు ఎప్పుడూ ఉండాలి, యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకున్నా సక్రమంగా నీరు అందడం లేదు. పొలాన్ని బీడు పెట్టుకోలేం.. సాగు చేసుకుంటే కష్టాలు తప్పడం లేదు.

\- కోటేశ్వర్‌రెడ్డి, రైతు కనిమెట్ట

మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు



శంకర సముద్ర రిజర్వాయర్ పెండింగ్ సమస్యను మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వంద కోట్లు మంజూరు చేస్తే మనం ప్రారంభించిన ప్రాజెక్టును మనమే పూర్తి చేసినట్లు అవుతుందని విన్నవించాను. కలెక్టర్ కూడా నివేదిక ప్రభుత్వానికి పంపించారు. ఏ సమయంలోనైనా రిజర్వాయర్‌కు నిధులు కేటాయించే ఆవకాశం ఉంది.

\- మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే, దేవరకద్ర

ఇంటర్వ్యూ..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గద్వాల న్యూటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అన్ని చర్యలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధులపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప వెల్లడించారు.

సీజనల్ ఎలా వ్యాపిస్తాయి?

వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి సీజనల్ వ్యాధుల ప్రభావం ఉంటుంది. దోమల వల్లన కలరా, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపిస్తాయి. ప్రస్తుతం డెంగీ వల్ల ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాదిలో జోగుళాంబ గద్వాల జిల్లాలో 30 మంది డెంగీ బారిన పడ్డారు.

జిల్లాలో ఎంతమంది సీజనల్ వ్యాధుల బారిన పడ్డారు

జూన్ 1 నుంచి సీజనల్ వ్యాధులపై ఫీవర్ సర్వేలు నిర్వహించాము. జూన్‌లో 600 మంది, జూలై లో 437 మంది, ఆగస్టులో 879 మంది, సెప్టెంబరు 9 వరకు 163 మంది, అక్టోబరులో 312 మంది ఈ సీజనల్ వ్యాధుల బారిన పడ్డారు.

వ్యాధుల నివారణపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

ఫీవర్ సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతీ రోజు 50 ఇళ్లను సర్వే చేసి అందులో ఫీవర్‌తో బాధుపడుతున్న వారికి మెడిసిన్ కిట్ ఇస్తున్నాము. వారికి నయం కాకపోతే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి ట్రీట్‌మెంట్ చేయించి జ్వరాలనుంచి ఉపశమనం పొందేలా చూస్తాం

జిల్లాలో ఎంతమందికి టెస్ట్‌లు చేశారు.

జిల్లాలో సీజనల్ వ్యాదులపై ఇప్పటివరకు కిట్ మెథడ్‌లో పాటు ఎలీసా పరీక్షలకు సంబంధించి 1,237 మందికి టెస్టులు నిర్వహించాము.

సీజనల్ వ్యాధులకు సంబంధించి మందుల కొరత ఉన్నదా...

జిల్లాలోని పీహెచ్‌సీలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటి వరకు మందుల కొరత లేదు. అన్ని రకాల మందులు ఉన్నాయి.

అంకితభావంతో పని చేయాలి

● కలెక్టర్ బదావత్ సంతోష్



ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పని చేసి మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన 210 మంది నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు, కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం పూర్తయ్యింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరై నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు ఉత్తర్వు పత్రాలను అందజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు 129 మంది ఎస్టీజీలు, 13 మంది భాషా పండితులు, ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ సబ్జెక్టులకు సంబంధించి 66 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఖాళీగా ఉన్న పాఠశాలలను కెటాయించారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీఈవో గోవిందరాజులు, నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్‌రావు, విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్‌రెడ్డి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే బాలలను ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది

\- బాపూబాటలో సత్యశోధన పాదయాత్రలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు అందుకే వాళ్లు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెరిగితే పెద్దయ్యాక ఉన్నతంగా ఉంటారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలోని బాపూబాటలో సత్యశోధన పాదయాత్ర గద్వాలకు చేరుకున్నది. ఎమ్మెల్యే స్వాగతం పలికి పాదయాత్రకు మద్దతు తెలిపారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గాంధీ జయంతి రోజున అలంపూర్ అమ్మవారి ఆశీస్సులతో యాత్ర ప్రారంభమై గద్వాలకు చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం యువతలో మార్పు తీసుకరావడం కోసం విజయ్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హనుమంతు, కౌన్సిలర్ మురళీ, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, కురుమన్న, మోహన్ యాదవ్, తిమ్మప్ప ఉన్నారు.

పాప ప్రక్షాళనకు శ్రీకారం

● ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ ఆరా
● ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులను విచారించే అవకాశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయాల్లో జరిగే భూ బాగోతాలపై విచారణ చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలోని చెన్నాకేశవస్వామి ఆలయ భూములకు వోఆర్‌సీలు ఇవ్వడం, గ్రామంలో అనుభవదారులు ఆ భూములను విచ్చలవిడిగా విక్రయించడంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'హే..కేశవా మన్నించు' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ బీఎం సంతోష్ స్పందించినట్లు సమాచారం. ఆర్డీవో కార్యాలయంలో జరిగే అక్రమాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్న అభిప్రాయాన్ని ప్రభుత్వ పరిశీలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సదరు కార్యాలయంలో కొన్ని నెలలుగా అడ్డదారుల్లో వోఆర్సీలు పుట్టగొడుల్లా పుట్టుకొస్తుండంపై ఇప్పటికే ఉన్నతాధికారులు నిఘా పెట్టారని సమాచారం. తాజాగా దేవుడి భూములకు సైతం వోఆర్సీలు ఇవ్వడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో జిల్లాలో కలకలం రేగింది. ఈ తతంగంలో అధికంగా డబ్బులు చేతులు మారినట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై మంగళవారమే ఉన్నతాధికారులు ఆర్డీవో కార్యలయ ఉద్యోగుల నుంచి మౌఖిక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఇప్పటికే ఆరోపణలు ఉండటంతో విచారణ చేస్తే తమ బండారం బయట పడుతుందని రాజకీయ నాయకుల ద్వారా పైరవీలకు సిద్ధమయ్యారని వినికిడి.

పోటాపోటీ

- ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం కాంగ్రెస్ నాయకుల తహతహ
- గ్రామాలు.. పట్టణాల్లో తీవ్ర పోటీ
- ఇప్పటికీ సగం గ్రామాలు, వార్డులలో పూర్తికాని కమిటీల ఎంపిక
- సభ్యులుగా ఉండేందుకు ఉబలాటం
- పైరవీలు చేసుకుంటున్న కేడర్
- భవిష్యత్తులో ఈ కమిటీల ద్వారానే సంక్షేమ పథకాలు అమలవుతాయన్న ప్రచారం



మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీపై చర్చిస్తున్న నాయకులు(ఫైల్)

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో చోటు కోసం కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నారు. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడం, ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో ఈ కమిటీల్లోనైనా చోటు దక్కించుకోవాలని పైరవీలు చేస్తున్నారు. భవిష్యత్‌లో అన్ని ప్రభుత్వ సంక్షేమల పథకాలు లబ్ధిదారుల ఎంపిక ఈ కమిటీల ద్వారానే జరుగుతుందనే ప్రచారం సాగుతుండటంతో.. నాయకులు ఆరాటపడుతున్నారు. పోటీ తీవ్రంగా ఉన్న చోట ఇతర పదవులు ఇస్తామని నచ్చజెపుతుండగా, అయినా వినని వారిని ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తున్నారు.

మహబూబ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద అనర్హులకు ఇళ్లు కేటాయించారని, ఒక్కొక్కరికి రెండు మూడేసి మంజూరు చేశారని ఆరోపణలు వచ్చాయి. దాంతో ఇళ్లులేని పేదల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ప్రస్తుతం అలాంటి తప్పిదాలను చేయొద్దని, లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కమిటీల ద్వారా ప్రజల మధ్యనే లబ్ధిదారులను ఎంపిక చేయాలనే ప్రయత్నాలు చేస్తోంది. అందుకే గ్రామాలు, పురపాలికల పరిధిలోని వార్డులలో ఇందిరమ్మ కమిటీలను నియమించాలని దసరా ముందు రోజు ఈ నెల 11న ప్రభుత్వం జీవో జారీ చేసింది. మార్గదర్శకాలు జారీ చేసి, ఒక్క రోజులోనే అంటే 12న కమిటీలను ఎంపిక చేయాలని ఉత్తర్వులలో పేర్కొంది. అయితే 12న దసరా

మిగతా 6వ పేజీలో...

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ

టీకాలు వేయించాలి

\- జిల్లా పశువైద్యాధికారి రమేష్

వెల్దండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి జీవీ రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని బైరాపూర్, రాచూరు, కొట్ర గ్రామాలలో పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో రమేష్ పాల్గొని రైతులకు గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, సిబ్బంది నరేష్‌రెడ్డి, వెంకన్న, రియాజ్, నర్సింహ, సాయిబాబా, తిర్పతయ్య, మొగులయ్య, బాలు, విజేందర్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

అంతస్తుల్లో.. అనుబంధాలు

- ఎక్కడెక్కడి వారినో కలిపే అపార్ట్‌మెంట్లు
- భిన్న వర్గాల వారు ఒక్క చోటనే జీవనం
- ఆపద సమయాల్లో ఒకరికొకరు అండ
- అందరూ ఒక్కటై ఉత్సవాలు, పండుగలు

మహబూబ్‌నగర్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 15: వారందరూ ఎక్కడో పుట్టారు.. ఎక్కడో పెరిగారు.. వృత్తి, ఉద్యోగం, ఉపాధి కోసం పట్టణానికి చేరారు. బహుళ అంతస్తుల భవనాల్లో (అపార్ట్ మెంట్లలో) నివాసముంటున్నారు. పక్క పక్కనే, ఒక్క తీరుగా ఉండే ఫ్లాట్ల (ఇళ్ల)లో ఉంటారు. ఒకరితో ఒకరికి పరిచయాలు పెరుగుతాయి. వ్యక్తులతో పాటు, కుటుంబాల మధ్య బంధాలు, అనుబంధాలు పెంచు కుంటారు. కష్ట సుఖాలు పంచుకుంటూ.. ఆపదలు, అవసరాల్లో ఆదుకుంటూ విడివిడిగా నివసిస్తారు... ఒక్కటిగా జీవిస్తారు.. పాలమూరు పట్టణంలో పెరుగుతున్న అపార్ట్ మెంట్ కల్చర్‌పై 'ఆంధ్ర జ్యోతి' ప్రత్యేక కథనం..

విస్తరిస్తున్న పాలమూరు పట్టణం

పాలమూరు మునిసిపాలిటీ రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా అంతకంతకు పెరుగుతోంది. ఒకప్పుడు అపార్ట్‌మెంట్లు అంటే పెదవి విరిచే జనం, ఇప్పుడు వాటిపైనే అధిక ఆసక్తి చూపుతున్నారు. సెక్యూరిటీతో పాటు, పలు రకాల పౌర సేవలు ఉన్న చోటే అందుబాటులో ఉండటం, అందరితో కలిసి మెలిసి జీవనం సాగించే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది ఫ్లాట్లు కొనేందుకు ఇష్టపడుతున్నారు. వాటిని కొని అద్దెకు ఇచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో గత ఐదేళ్లలో మహబూబ్‌నగర్ పట్టణంలో అపార్ట్‌మెంట్ల సంఖ్య వంద దాటింది. ఇది క్రమంగా అన్ని పట్టణాలకూ విస్తరిస్తోంది. వనపర్తి, నారాయణపేట, గద్వాల, జడ్చర్ల తదితర పట్టణాలలోనూ బహుళ అంతస్తులు వెలుస్తున్నాయి. ఇది వరకు 15-20 ఫ్లాట్లతో అపార్ట్‌మెంట్లు ఉండేవి. ఇప్పుడు వంద ఫ్లాట్లతో సువిశాలమైన స్థలంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం కొనసాగుతోంది. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాల్లో వీటి నిర్మాణం ఎక్కువగా కొనసాగుతోంది.

చిటపటలు.. రుసరుసలు

అపార్ట్‌మెంట్ జీవనంలో అన్నీ బాగుంటాయని చెప్పడానికి వీలు ఉండదు.. ఎన్ని వసతులున్నా కొన్ని ఇబ్బందులు కూడా ఉంటాయి. 70 నుంచి 200 వరకు కుటుంబాలు ఒక్క చోట నివసించే అపార్ట్‌మెంట్లలో అందరి మనస్తత్వాలు ఒకేలా ఉండవు. ఒక్కొక్కరూ ఒక్కో తీరుగా ఉంటారు. మెజారిటీ సభ్యులు కలిసి మెలిసి జీవిస్తున్నా.. ఒకరిద్దరి వల్ల అప్పుడప్పుడు చిన్న చిన్న వాగ్వాదాలు.. గొడవలు తప్పవు. వీటితో పాటు చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఉంటాయి. వ్యక్తిగత నిర్ణయాలకు అవకాశం ఉండదు. ఏం చేయాలన్నా అపార్ట్‌మెంట్ కమిటీ అనుమతి ఉండాల్సి ఉంటుంది. చిన్న చిన్న శుభకార్యాల కోసం సెల్లార్, టెర్రస్ వాడుకోవాలంటే అనుమతి అవసరం అవుతుంది. రాత్రి 11 గంటల తర్వాత డీజేలు పెట్టి డ్యాన్సులు చేస్తామంటే మిగతా వారికి ఇబ్బంది అవుతుంది కాబట్టి అవన్నీ కుదరవు. పార్కింగ్, కామన్ స్థలాన్ని వినియోగించుకునే విషయంలోనూ ఆంక్షలుంటాయి. గోడలకు మేకులు కొట్టడం, ఇళ్ళ ముందు ఇష్టానుసారం చెప్పులు వదలడం, ఊడ్చినప్పుడు పక్క ఇళ్ల ముందు పడటం, నీరు వారింటి ముందుకు వెళ్లడంలాంటి వాటిపై చిన్న చిన్న పంచాయితీలు జరుగుతుంటాయి. కమిటీ నిర్ణయాలు కొందరికి నచ్చకపోవడం, తమకు ప్రాధాన్యత తగ్గిందంటూ చిటపటలు, రుసరుసలు కూడా ఉంటాయి. అయితే ఇలాంటి గొడవలు సాధారణంగా టీ కప్పులో తుపానులో సమిసి పోతుంటాయి. ఇతరులకు ఇబ్బంది లేకుండా కొంత క్రమ శిక్షణతో మెలిగితే అపార్ట్‌మెంట్ జీవితం హాయిగా.. సాగిపోతుందనడంలో అతిశయోక్తి లేదు.



పాలమూరులోని మెట్రోపాలిస్ మనటౌన్ అపార్ట్‌మెంట్

ఆపదల్లో ఒకరికొకరు అండ

అపార్ట్‌మెంట్‌లో ఎవరికి ఏ ఆపద వచ్చినా మిగతా వారు తోడుగా నిలుస్తారు. ఆసుపత్రులకు తీసుకెళ్లడం, ఇతరాత్రా సాయం అందించి భరోసా ఇస్తారు. ఉదాహరణకు గతంలో కరోనా వచ్చినప్పుడు ఎవరికైనా వైరస్ సోకిన వారికి మిగతా వారంతా సహకారం అందించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికి వారే కాకుండా అందరికీ అందరూ అన్న రీతిలో సహాయ సహకారాలు అందించుకుంటారు. అలాగే అపార్ట్‌మెంట్లలో రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఉంటోంది. ఇంటికి తాళం వేసి వారం రోజులు ఎక్కడికైనా ధైర్యంగా వెళ్లి రావొచ్చు.. ఎందుకంటే ఇరుగు పొరుగు ఫ్లాట్లలో జనం ఉంటారు. చుట్టూ ప్రహరీ ఉంటుంది. ప్రధాన గేటు వద్ద వాచ్‌మెన్లు కాపలా ఉంటారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. సెల్లార్లో పార్క్ చేసిన కార్లు, ద్విచక్రవాహనాలకు పూర్తి స్థాయి రక్షణ ఉంటుంది. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకుల్లో నీరు నింపడం, చెత్త సేకరణ, లిఫ్ట్ నిర్వహణ, సెల్లార్, కారిడార్లను శుభ్రం చేయడం, ట్యాంకులు కడగటం లాంటి పనులకు ప్రత్యేకంగా వాచ్‌మెన్ ఉంటాడు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఎక్కువ మంది అపార్ట్‌మెంట్లలో జీవనం గడిపేందుకు ఇష్టపడుతున్నారు.

కలిసి మెలిసి వేడుకలు

ఒకే చోట 50 నుంచి 100 కుటుంబాలు నివసిస్తున్నా, నిత్యం ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమై ఉంటారు. ఒకే చోట ఉంటున్నా ప్రతీ రోజు కలుసుకొనే అవకాశం ఉండదు. కానీ పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలు, శుభకార్యాలు, ఉత్సవాలకు మాత్రం అందరూ ఒక్కటవుతారు. ఒకరికొకరు చేదోడు వాదోడుగా నిలుస్తారు. ప్రధానంగా వినాయక చవితి ఉత్సవాలు, బతుకమ్మ సంబురాలు, దేవీ నవరాత్రులు, న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. ఇతరులతో సంబంధం లేకుండా అపార్ట్‌మెంట్‌లో నివసించే వారందరూ చందాలు వేసుకొని ఉత్సవాలు జరుపు కుంటారు. వాటికి సెల్లార్లే వేదికలుగా మారుతాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ప్రతీ కుటుంబం ప్రసాదాలు, ప్రత్యేక వంటకాలను చేసి అమ్మవారికి సమర్పిస్తారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఐదు నుంచి తొమ్మిది రోజుల పాటు అపార్ట్ మెంట్లలో డీజేలు మారుమోగుతాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా నృత్యాలు, దాండియా, బతుకమ్మ ఆడుతారు. ఇలాంటి ఉత్సవాలతో పాటు చిటీ పాటలు, కిట్టీ పార్టీలు కూడా కొనసాగుతుంటాయి. కొన్ని అపార్ట్‌మెంట్లలో సభ్యులందరూ తలా ఇంత చందాలు వేసుకొని విహార యాత్రలకు కూడా వెళ్తుంటారు.

కలగన్న కొలువు..

విద్యాబోధనపై మమకారం.. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలన్న లక్ష్యం.. డీఎస్సీలో విజయం సాధించాలన్న పట్టుదల.. అందుకోసం వారి చేసిన కృషి ఫలించింది.. కొలువు కల నెరవేరింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ - 2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరనున్నారు. ఈ సందర్భంగా నూతన కొందరు ఉపాధ్యాయులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే...

అక్కా బావ సహకారంతో..



ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పూర్తి చేశాను. డీఎస్సీ మూడో ప్రయత్నంలో ఎస్ఏ హిందీ పండిట్‌గా ఉద్యోగం వచ్చింది. అక్క శ్రీదేవి, బావ శ్రీకాంత్ సహకారంతో ఉన్నత చదువులు చదివి నేడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

- రాకేష్, ఎస్ఏ హిందీ

ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టం



ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టం. మా నాన్న ఈ వృత్తిలో ఉండటంతో ఆయన ఉన్న వృత్తిలోనే నేను ఉండాలని నిర్ణయించుకున్నా. అందుకే కష్టపడి చదివి డీఎస్సీ -2024లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో పోస్టు సంపాదించాను. జడ్పీహెచ్ఎస్ లాల్‌కోటలో పోస్టింగ్ ఇచ్చారు.

- బొల్లం సుమన, స్కూల్ అసిస్టెంట్ గణితం

నాలుగేళ్లుగా ఎదురుచూశా...



మాది మక్తల్. ప్రభుత్వ ఉద్యోగం కోసం నాలుగేళ్లుగా ఎదురు చూశాను. ప్రస్తుత డీఎస్సీలో నాకు ప్రభుత్వ ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. నారాయణపేట బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పోస్టింగ్ ఇచ్చారు.

-కవిత, ఎస్ఏ తెలుగు

ఆనందంగా ఉంది



ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. మొదటి ప్రయత్నంలో ఒకటిన్నర మార్కులతో మిస్ అయ్యాను. ఈ సారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఇంట్లో ఉండి బాబును చూసుకుంటూనే చదివాను. జాబ్ కొట్టాను.

- సమత, ఎస్జీటీ , గొరిట, తిమ్మాజిపేట మండలం

చాలా సంతోషంగా ఉంది



డీఎస్సీ -2024 లో స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు ఎంపికకావడం ఎంతో సంతోసంగా ఉంది. జిల్లాలోనే ఈ విభాగం మొదటి ర్యాంకు సాధించాను. దీనికోసం ఎంతో కష్టపడి చదివాను. ఆ కష్టానికి ఫలితం వచ్చింది. పోస్టింగ్ కూడా పాలమూరులో రావడం మరింత సంతోషంగా ఉంది.

- అశోక్ కుమార్

రెండో ర్యాంకు సాధించాను



నేను ప్రస్తుతం తెల్కపల్లి ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో పీడీ ఉద్యోగం చేస్తున్నా. అది వద్దనుకొని ఈ డీఎస్సీలో మొదటి ప్రయత్నంలోనే జిల్లాలో రెండో ర్యాంకు సాధించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను.

- అశోక్, పీఈటీ, మంతటి

నావంతు బాధ్యతను నిర్వర్తిస్తా..



ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదిగా బావించాను. ఒకవైపు తండ్రికి తోడు సిమెంటు బ్రిక్స్ తయారీలో ఉంటూనే ప్రిపేర్ అయ్యాను. 2018లో నిర్వహించిన డీఎస్సీలో ఎంపిక కాలేదు. దీంతో అవనిగడ్డలో కోచింగ్ తీసుకొని ప్రిపేర్ అయ్యాను. సక్సెస్ అయినందుకు సంతోషంగా ఉంది. విద్యాబోధనతో నావంతు బాధ్యతను నిర్వహిస్తాను.

- అశ్వల్ ఎస్జీటీ అయిజ

జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాను



ఉపాధ్యాయురాలిని కావాలని బీఎస్సీ, టీటీసీ చేశాను. ఆ తర్వాత బీఈడీ పూర్తి చేశా. రెండు కేటగిరీలలో ఎంపికయ్యా. ఎస్జీటీలో జిల్లా రెండో ర్యాంకు సాధించాను. ఓపెన్ కేటగిరిలో ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- హసీనా, ఎస్జీటీ ఇటిక్యాల

చదువుకున్న ప్రతీ వ్యక్తికి జాబ్ వస్తే బాగుంటది

చదువుకున్న ప్రతీ వ్యక్తికి జాబ్ వస్తే బాగుంటది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం సంతోషంగా ఉంది. అదే విధంగా భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా యువతకు ఉద్యోగాలు కల్పించాలి. తన విధుల్లో భాగంగా విద్యార్థులను భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందేటట్లు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

- రంజిత్, కొత్త ఉపాధ్యాయుడు

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

చారకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

● తిమ్మాజిపేట : పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోడుపర్తి గ్రామ పంచాయతీ ఆర్‌సీ తండాలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేశారు. పశువైద్య శిబిరంలో 488 తెల్లజాతి, 285 నల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రావణి, సిబ్బంది తిరుపతయ్య, విజయ, లలిత, యాదగిరి, శాంతయ్య, గోపాలమిత్రలు స్వామి చారి, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : గ్రామాల్లోని రైతులు తమ తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మధు అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోటా పోటీ

- ● ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం కాంగ్రెస్ నాయకుల తహతహ
- ● ఎక్కువ మంది పోటీపడుతున్న చోట నాయకుల బుజ్జగింపులు
- ● భవిష్యత్తులో ఈ కమిటీల ద్వారానే సంక్షేమ పథకాలు అమలవుతాయన్న ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

పండుగ ఉండటంతో కమిటీల ఎంపిక సాధ్యం కాదని, సోమవారంలోపు గ్రామాలలో ఎంపీడీవోలకు, మునిసిపాలిటీలలో కమిషనర్ల ద్వారా కలెక్టర్‌లకు జాబితాను అందజేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే మంగళవారం నాటికి జిల్లాలో సగం కమిటీల ఎంపిక కూడా పూర్తవలేదు. అందుకు కారణం కమిటీలలో చోటుకోసం తీవ్ర పోటీ నెలకొనడమే. పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కార్యకర్తలు ఎలాంటి పదవులు లేకుండా ఖాళీగా ఉన్నారు. సర్పంచ్ ఎన్నికలు కూడా జరగకపోవడంతో గ్రామాల్లో ఎటువంటి పోస్టులు లేవు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కమిటీలలో చోటుకోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. దాంతో నాయకులు తలపట్టుకుంటున్నారు.

పోటీలో ముఖ్యులు

గ్రామాలలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు పోటీపడే నాయకులు సైతం ఇందిరమ్మ కమిటీలలో తమ పేర్లు చేర్చాలని పట్టుబడుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడవుతాయోనని, అప్పటి వరకు కమిటీలలో ఉంటే ఒకవేళ సర్పంచ్ అయితే కమిటీ ఛైర్మన్‌గా తామే ఉంటామని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల స్థాయి నాయకులకు కమిటీల ఎంపిక ఇబ్బందికరంగా మారుతోంది. సర్పంచ్‌లు లేకపోవడంతో స్పెషల్ ఆఫీసర్‌ను ఛైర్మన్ చేసి, ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామానికి చెందిన వ్యక్తులను కమిటీలో సభ్యులుగా చేర్చాల్సి ఉన్నందున ఒక్కో గ్రామంలో ఏడెనమిది మంది పోటీపడుతున్నారు. మండల స్థాయి నాయకులు వారిని కూర్చోబెట్టి బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కమిటీలో అవకాశం రానివారికి మరోదాంట్లో అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. అయినా వినని వారికి ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తున్నారు. ఇప్పటి వరకు కొన్ని మండలాల నుంచి పేర్లు రాగా, మరికొన్ని మండలాల్లో పోటీ కారణంగా అధికారులకు పూర్తి స్థాయిలో జాబితాలు సమర్పించలేదు. మునిసిపాలిటీలలో మరీస్లోగా ఉన్నట్లు తెలుస్తోంది. కమిటీల జాబితాలు రావడానికి మరో రెండ్రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. కొన్నిచోట్ల కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న వారికి, ఎన్నికల తరువాత పార్టీలో చేరిన వారికి మధ్య పంచాయతీ నడుస్తోంది. పాత, కొత్తవారి మధ్య పోటీ నెలకొంది.



భవిష్యత్‌లో కమిటీలకే ప్రాధాన్యం అన్న ప్రచారంతో..

ప్రస్తుతం గ్రామాలలో సర్పంచ్‌లు లేకపోవడం, ఎన్నికల నిర్వహణకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో అప్పటి వరకు ఈ కమిటీలతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. భవిష్యత్‌లో ప్రభుత్వం తరపున చేపట్టే అన్ని కార్యక్రమాలను ఈ కమిటీల ద్వారానే చేపడతారని చర్చ జరుగుతుండటంతో పోటీ పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ వ్యవస్థ, జన్మభూమి కమిటీల తరహాలో.. ఈ కమిటీల ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతోపాటు ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్న ప్రచారం సాగుతోంది. అందుకే గ్రామ స్థాయిలో ముఖ్యులంతా కమిటీలో సభ్యులుగా ఉండేందుకు పోటీపడుతున్నారు. కమిటీలో ఉంటే తమ వాళ్లకు న్యాయం చేయొచ్చని, కొంతమంది లబ్ధిదారులనైనా ఎంపిక చేస్తే తమ ముద్ర ఉంటుందని భావిస్తున్నారు. చాలా వరకు గ్రామ, మండల స్థాయిలోనే జాబితాను ఫైనల్ చేస్తున్నారు. మండలంలో పోటీ ఉన్న రెండు, మూడు గ్రామాల్లో మాత్రం జాబితాను ముఖ్య నాయకుల ముందుంచి, ఫైనల్ చేస్తామని బుజ్జగిస్తున్నారు. మొత్తంగా ఇందిరమ్మ కమిటీలతో గ్రామాలలో రాజకీయ సందడి నెలకొంది.

సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్ మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

స్టేడియంలో సింథటిక్ ట్రాక్ కోసం గతంలో కేంద్ర ప్రభుత్వ బృందం పరిశీలించింది. కానీ పనులు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదు?

డీవైఎస్‌వో: అప్పట్లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఖేలో ఇండియా ప్రతినిధి బృందం వచ్చి సింథటిక్ ట్రాక్ కోసం స్టేడియం మైదానాన్ని పరిశీలించారు. కానీ ఇప్పుడు ఖేలో ఇండియా ద్వారా ఇది సాధ్యమయ్యేలా లేదు. రాష్ట్ర ప్రభుత్వం సాట్స్ నిధులు రూ.7.50 కోట్లతో నిర్మించనుంది. కనీసం రూ.10 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు వస్తే త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ఏడాదిన్నర నుంచి వాలీబాల్ అకాడమీ పనులు జరుగుతూనే ఉన్నాయి.. ఎప్పుడు ప్రారంభిస్తారు?

డీవైఎస్‌వో: గత ప్రభుత్వ హయాంలో అండర్-16 బాల, బాలికల వాలీబాల్ అకాడమీ మంజూరు చేశారు. రెండు వాలీబాల్ కోర్టులు, ఇతర వసతులు ఏర్పాటు చేశాం. ఇంకా సామగ్రి, వంటలకు కాంట్రాక్టు ఇవ్వాల్సి ఉన్నది. ఏడాదిన్నర క్రితం రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించి, 20 మంది బాలలు, 20 మంది బాలికలను ఎంపిక చేశాం. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఈ విద్యా సంవత్సరంలో అకాడమీ ప్రారంభం అయ్యేలా కృషి చేస్తా. వాలీబాల్ అకాడమీ ప్రారంభమయ్యాక అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటుపై దృష్టి సారిస్తాం. అందుకు మరో కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపించాం.



సీసీకుంట మండలం అల్లీపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియం

ప్రస్తుతం మూడు క్రీడలకు మాత్రమే కోచ్‌లున్నారు. మిగతా క్రీడలకు లేరు. కొత్త కోచ్‌లు ఎప్పుడొస్తారు?

డీవైఎస్‌వో: అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడలకు మాత్రమే కోచ్‌లు ఉన్నారు. ఖేలో ఇండియా కింద ఫుట్‌బాల్ క్రీడా కోచింగ్ నడుస్తోంది. కబడ్డీ, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఆర్చరీ కోర్టులు ఉన్నాయి. సీనియర్ క్రీడాకారులు, ఆయా అసోసియషన్ల వారి పర్యవేక్షణలో చిన్నారులు నేర్చుకుంటున్నారు. మరో ఐదు మంది కోచ్‌లకు ప్రతిపాదనలు పంపించాం. రాగానే చిన్నారులకు అందుబాటులో ఉంటూ శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

కోట్ల రూపాయాలతో స్టేడియం గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం నిర్మించినా కోచ్‌లు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫిట్‌నెస్ కోసం వస్తున్న వారి నుంచి ఆదాయం వస్తుందా?

డీవైఎస్‌వో: ఏక కాలంలో ఆరు కోర్టుల్లో షటిల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేయడానికి ఏర్పాటు చేశాం. క్రీడాకారులకు షటిల్ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ క్రీడాకారులు నేర్పిస్తున్నారు. ఇక్కడి ఇండోర్ స్టేడియానికి, ప్రభుత్వ ఎంవీఎస్ కళాశాలలో ఉన్న ఇండోర్ స్టేడియానికి కోచ్‌ల గురించి ప్రపోజల్ పంపించాం. త్వరలో కోచ్‌లు రానున్నారు. ఫిట్నెస్ కోసం వచ్చే వారు చెల్లించే రుసుంతో నిర్వహణ, కరెంటు బిల్లులకు సరిపోగా కొన్ని మాత్రమే మిగులుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఉన్న మైదానాల పరిస్థితి ఏంటి?

డీవైఎస్‌వో: దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించిన ఇండోర్ స్టేడియం భూత్పూర్ మండలం పోతులమడుగులో నిర్మిస్తున్నాం. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ సిబ్బంది, కోచ్‌లను నియమిస్తాం. సీసీ కుంట మండలం అల్లీపూర్‌లో ఇండోర్ స్టేడియం ఉన్నా షటిల్ కోచ్ లేరు. ఇందుకు ప్రతిపాదనలు పంపించాం. జడ్చర్లలో స్టేడియం మైదానం ఉన్నప్పటికీ మట్టి అథ్లెటిక్స్ ట్రాక్ ఉంది. ఖేలో ఇండియా కింద ప్రపోజల్ పెట్టి సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించాలని ఆలోచిస్తున్నాం. త్వరలో సాట్స్ ఛైర్మన్ దృష్టికి తీసుకవెళ్తాం.

అడ్డగోలు ఆర్డర్లు

- ● ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ డిప్యుటేషన్లు
- ● డీఎంఅండ్‌హెచ్‌వో మౌఖిక ఆదేశాలతో 39 మందికి ఆర్డర్లు
- ● కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- ● విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అక్రమాలు రోజు రోజుకు వెలుగులోకి వస్తున్నాయి. మొన్న ఆడిట్ కోసం ఒక్కో పీహెచ్‌సీ డాక్టర్ల నుంచి రూ.20 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు రాగా, ప్రస్తుతం అక్రమంగా డిప్యూటేషన్ ఆర్డర్లు ఇచ్చిన వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో అన్ని డిప్యూటేషన్లు రద్దు చేస్తూ, ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ ఆ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అక్రమంగా డిప్యూటేషన్లు ఇచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌వో మౌఖిక ఆదేశాలతో ఏకంగా 39 మందికి ఆర్డర్లు ఇచ్చేశారు. ఒక్కో ఆర్డర్‌కు ముడుపులు కూడా సమర్పించినట్లు సమాచారం. కలెక్టర్‌ను సైతం తప్పుదోవపట్టిస్తూ ఇలాంటి ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ దృష్టిసారించి, విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ..

ఈ అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంలో కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారు. వాస్తవానికి ఎక్కడైనా పోస్టులు ఖాళీగా ఉంటే ఆ ప్రాంతాల్లో వేరేవాళ్లకు డిప్యుటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదికూడా కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. కానీ కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి వారికి అనుకూలమైన వారికి డిప్యూటేషన్లు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఈ శాఖపై దృష్టిసారించి విచారణ జరిపిస్తే మరెన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

39 మందికి డిప్యుటేషన్లు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఅండ్‌హెచ్‌వో మౌఖిక ఆదేశాలతో 39 మందికి ఇటీవల అక్రమంగా డిప్యూటేషన్ ఆర్డర్లు ఇచ్చారు. అందులో 18 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఉండగా, 15 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఆరు మంది ఆఫీస్ సబార్డినేట్‌లు ఉన్నారు. ఇందులో కూడా తమకు అనుకూలమైన వారికి కార్యాలయంలోనే పోస్టింగ్‌లు ఇచ్చారని తెలుస్తోంది. కొత్తగా వచ్చిన వారిని దూర ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. అదేవిధంగా ల్యాబ్ టెక్నీషియన్లలో కూడా అవసరం లేని చోటకు, అనుకూలమైన వారికి, అర్హత లేని వారికి పోస్టింగులు ఇచ్చారు. ఖాళీలు, అవసరాన్ని బట్టి ఇస్తున్నట్లు, తాత్కాలిక సర్దుబాటు అంటూ చూపించారు.

మచ్చుకు కొన్ని..

● జనరల్ ఆస్పత్రిలోని టెంపరరీ హాస్పిటలైజేషన్ వార్డు(టీహెచ్‌డబ్ల్యూ)లో రోగులు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా మూత పడింది. అక్కడ ల్యాబ్ కూడా లేదు. అయినా హన్వాడ పీహెచ్‌సీలో ఉండే ల్యాబ్ టెక్నీషియన్ గత 13 సంవత్సరాలుగా డిప్యూటేషన్‌పై అక్కడ ఉంటున్నాడు. సాధారణ బదిలీలో ఆయనను రాజాపూర్ పీహెచ్‌సీకి ట్రాన్స్‌ఫర్ చేశారు. మళ్లీ అతనికి టీహెచ్‌డబ్ల్యూ వార్డుకు పోస్టింగ్ ఇవ్వడంలో అంతర్యం ఏమిటో అధికారులే చెప్పాలి.

● డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోని డీఎల్‌వో విభాగంలో ఆరేళ్లుగా ఉన్న ఓ ల్యాబ్ టెక్నీషియన్ సాధారణ బదిలీల్లో కోత్లాబాద్ పీహెచ్‌సీకి వెళ్లారు. అయినా అక్కడికి పంపించకుండా మళ్లీ జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఇతను పట్టణంలో ఓ నర్సింగ్ హోం నిర్వహిస్తున్నాడు.

● కోయిలకొండలో ఉన్న ఓ మహిళా ల్యాబ్ టెక్నీషియన్‌ను జిల్లా కేంద్రానికి తేవడానికి పట్టణంలోని బస్తీ దవఖానలో ఉన్న ఓ పెరాలసిస్ బాధిత ల్యాబ్ టెక్నీషియన్‌ను టీహబ్‌లో వేస్తూ ఆర్డర్ ఇచ్చారు.

● ఐడీఎస్‌పీ మహబూబ్‌నగర్‌లో పోస్టింగ్ ఉన్న వ్యక్తిని జడ్చర్ల అర్బన్‌హెల్త్ సెంటర్‌కు ఆర్డర్ ఇచ్చారు. అతని స్వగ్రామం జడ్చర్లతో పాటు అక్కడే ఆయనకు వ్యాపారాలు ఉన్నందున పోస్టింగ్ ఆర్డరు ఇచ్చారు.

● సీసీకుంట పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వ్యక్తి డిప్యూటేషన్‌పై గత తొమ్మిదేళ్లుగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోనే పని చేస్తున్నాడు. సాధారణ బదిలీల్లో కూడా ఆయన సొంత పోస్టుకు వెళ్లలేదు. అయినా అతనికి డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోనే పోస్టింగ్ ఇవ్వడంతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్న విభాగాలను కేటాయించారు. ఇందుకోసం భారీగానే ముడుపులు సమర్పించినట్లు సమాచారం.

సర్దుబాటు చేశాం..

కొన్ని పీహెచ్‌సీలలో ఖాళీలు ఉన్నాయని కొంతమందిని సర్దుబాటు చేశాము. 104లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు పోస్టింగులు లేకుండా ఖాళీగా ఉండడంతో వారికి కొన్నిచోట్లకు ఆర్డరు ఇచ్చాము. ఇందులో ఏవైనా పొరపాట్లు జరిగితే పరిశీలించి సరిచేస్తాము.

- డాక్టర్ పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

క్రైం కార్నర్

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

నారాయణపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన గుట్కా పాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మనోహర్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచుకొని, విక్రయిస్తున్నట్లు వారికి పక్కా సమాచారం అందింది. దీంతో వారు మంగళవారం దాడులు నిర్వహించారు. రూ.5,370 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సి.రాముడు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించిన రైతుపై కేసు

గద్వాల క్రైం, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం చేసిన రైతుపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కొనసాగుతున్న సమయంలో అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన పరశురాముడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తన భూమిని ఇతరులు కబ్జా చేశారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులను ఇబ్బందులకు గురి చేశాడంటూ మంగళవారం అతడిపై గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరశురాముడు గతంలోనూ ఇలాగే ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ చెప్పారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం

దామరగిద్ద, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా దామరగిద్ద పాఠశాల తరగతి గదుల్లో ఫర్నిచర్, ఫ్యాన్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దసరా సెలవుల అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం పాఠశాలకు వచ్చారు. తరగతి గదుల తలుపులు, కిటికీలు తెరిచి ఉండటంతో ఆందోళన చెందారు. లోపలికి వెళ్లి చూడగా ఫర్నిచర్, ఫ్యాన్లు ధ్వంసమై ఉన్నాయి. రికార్డుల గదిలో ఫైళ్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు డిమాండ్ చేశారు.

తెగిన కేఎల్‌ఐ కాలువ



కాలువకు కొనసాగుతున్న మరమ్మతు

వెల్దండ, అక్టోబరు,15 (ఆంధ్రజ్యోతి), : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలోని లక్ష్మపురం వద్దనున్న కేఎల్‌ఐ కాలువ సోమవారం రాత్రి తెగిపోయింది. సమాచారం అందుకున్న అధికారులు వెం టనే అప్రమత్తం అయ్యారు. తెగిన కాలువకు మంగళవారం యంత్రాల సహాయంతో మరమ్మతు చేపట్టి గండిని పూడ్చారు. ఇదే చోట గతంలోనూ రెండు సార్లు కాలువకు గండి పడిందని స్థానిక రైతులు తెలిపారు. మరో సారి ఇలాంటి సంఘ టన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివేందుకు అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి ఉపకార వేతనాల కోసం దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్సీ సంక్షేమ అధికారి సుదర్శన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఉపకార వేతనాలను అందించనున్నట్లు తెలిపారు.

పల్లెటూరి కుర్రోళ్లు



ఖదీర్‌బాషా, రాజు, హరిప్రసాద్, దేవేంద్ర, పరశురాముడు

ఆలోచనలు కలిశాయి. లక్ష్యం ఒకటే అయ్యింది. ఆరుగురు పల్లెటూరి యువకులు ఒక్కటయ్యారు. వారి ఊహలు, ఆశలు, ఆశయాలు దృశ్య రూపం దాల్చాయి. ఇన్‌స్టాలో రీల్స్‌గా మారాయి.. యూట్యూబ్‌లో వీడియోలయ్యాయి. ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరిగింది. నెట్టింటి నుంచి సినిమా ప్రపంచంలోకి అడుగు పెట్టాలన్నదే ఆ 'పల్లెటూరి కుర్రోళ్ల' లక్ష్యం.. వినోదంతో పాటు సమాజ సేవ చేయడం వారి ధ్యేయం.. వారితో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. ఆలోచనలను, ఆశయాలను తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం.

- అయిజ (ఆంధ్రజ్యోతి)

- అదే పేరుతో ఒక్కటైన ఆరుగురు యువకులు
- రీల్స్, వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో సందడి
- ఇన్‌స్టాగ్రామ్‌లో 3.67 లక్షల మంది ఫాలోవర్లు
- యూట్యూబ్‌లో 64 వేల మంది సబ్‌స్క్రైబర్లు
- వినోదం, సందేశాలతో పాటు సమాజ సేవే లక్ష్యం

జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని మారుమూల గ్రామాలకు చెందిన ఆరుగురు యువకులు ఒక జట్టుగా కలిశారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలతో సందడి చేస్తున్నారు. వినోదం పండించడం.. సంతోషం కల్గించడమే, సమాజానికి సందేశాలు ఇవ్వడమే వారి లక్ష్యం. ఎప్పటికైనా సినిమా తీయాలన్నదే వారి ఆశయం. వారందరూ అయిజ మండల పరిధిలో, రాయలసీమ, కర్ణాటక సరిహద్దుకు దగ్గరలోని మారుమూల గ్రామాలకు చెందిన వారు. పెద్దగా చదువుకోలేదు.. కానీ కావలసినంత సృజనాత్మకత ఉంది. సరికొత్త ఆలోచనలతో వీడియోలు, రీల్స్ చేస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. అందుకు తగ్గట్లుగానే ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్లు, యూట్యూబ్‌లో సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

పల్లెటూళ్ల నుంచి నెట్టింటి వైపు

అయిజ మండలంలోని బైనపల్లి గ్రామానికి చెందిన ఖదీర్‌బాషా ఆర్థిక స్థోమత లేక 10వ తరగతితో చదువుకు స్వస్తి పలికారు. జీవనోపాధి కోసం ఫొటోగ్రాఫర్ వృత్తి చేపట్టారు. ఎప్పటికైనా సినిమా దర్శకుడు కావాలన్నది తన లక్ష్యం. అందుకోసం మరో ఐదుగు రిని ఎంచుకున్నారు. వారిలో రాజు కిసాన్‌నగర్‌కు చెందిన యువకుడు. అతడు కూడా 10వ తరగతితోనే చదువు ముగించి పొలం పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. అలాగే బైనపల్లికి చెందిన హరిప్రసాద్ కూడా 10వ తరగతితోనే చదువును ఆపేసి, పొలం పనులు చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన దేవేంద్ర ఇంటర్ వరకు చదువుకున్నారు. ఫొటోగ్రాఫర్ వృత్తితో జీవనం గడుపుతున్నారు. రాజాపూర్ గ్రామానికి చెందిన పరశురాముడు ఇంటర్ వరకు చదువుకుని, పొలం పనులు చేస్తున్నారు. మేడికొండ వీరేష్ చదువుకోలేదు. పొలం పనులు చేస్తుంటారు. ఆరుగురూ కలిసి 'పల్లెటూరి కుర్రోళ్లు' పేరుతో ఇన్‌స్టాలో పేజీ తెరిచారు. యూట్యూబ్‌లో ఛానల్ ప్రారంభించారు. కామెడీ, ఫైట్స్, ఆధ్యాతికత, సమాజ సేవ, సందేశాలతో కూడిన రీల్స్ వీడియోలు చేసి అప్‌లోడ్ చేయడం మొదలు పెట్టారు. కొద్ది రోజుల్లోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 3.67 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. యూట్యూబ్‌లో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 64 వేలకు చేరింది.

సినిమా దర్శకత్వమే లక్ష్యం



ఎప్పటికైనా పురాణ గాథలపై గ్రాఫిక్స్‌తో సినిమా చేయాలన్నది నా లక్ష్యం. అందుకు నాలాగే పల్లెటూరికి చెందిన యువకులు జతగా ఉంటే బాగుంటుందని వెతికాను. అలా ఆరుగురు యువకులం కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడ్డాం. అందరూ పల్లెటూర్లకు చెందిన వారమే కాబట్టి 'పల్లెటూరి కుర్రోళ్లు' అన్న పేరుతో రీల్స్, వీడియోలు చేస్తున్నాం. రీల్స్ యూట్యూబ్ ద్వారా వచ్చిన డబ్బుతో సామాజిక సేవ కూడా చేస్తున్నాం. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, బస్టాప్‌లో బెంచీలు ఏర్పాటు చేశాము. వేసవిలో చలివేంద్రాలు నిర్వహించాం. మొక్కలు నాటుతున్నాం. ఇలా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

- ఖదీర్ బాషా, యూట్యూబర్



కార్తీక స్నానం పుణ్యప్రదం

- ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి నుంచి కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు పుణ్య స్నానాలు
- నదీ స్నానం పరమ పవిత్రమని హిందువుల విశ్వాసం



ముడుమాల్ వద్ద కృష్ణానది తీరంలో భక్తులతో సంకల్పం చేయిస్తున్న అర్చకుడు (ఫైల్)

నారాయణపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక స్నానం పుణ్యప్రదమని, అత్యంత పవిత్రమని హిందువుల విశ్వాసం. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి నుంచి కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు నెల రోజుల పాటు నదుల్లో పుణ్యస్నానాలు చేయడాన్ని వ్రతంగా ఆచరిస్తారు. బుధవారం నుంచి ఈ వ్రతం ప్రారంభం కానున్నాయి. ఈ నెల రోజుల పాటు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ఉదయం ఆరు గంటలకు కాకడా హారతితో విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రధానంలో పట్టణంలోని శక్తిపీఠం, సంత్‌మర్ రామాలయం, బాలాజీ మందిర్, దత్త కృష్ణమందిర్, అవధూత నరసింహ స్వామి మఠం తదితర ఆలయాల్లో వేకువ జామునే పూజలు చేస్తారు. భక్తులు పుణ్య స్నానాలు చేసి ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

బ్రహ్మీ ముహూర్తం

సూర్యోదయంలోపు బ్రహ్మీ ముహూర్తంలో పుణ్య స్నానం చేయాలి. అనంతరం శైవ, విష్ణు మందిరాలకు వెళ్లి దీపారాధన చేయాలి. ముత్తైయిదువలు దీపారాధన చేసి ప్రదక్షిణలు చేస్తారు. నదికి వెళ్లి స్నానం చేసేందుకు వీలు కాని వారు ఇళ్లలోనే అభ్యంగన స్నానం చేయవచ్చని వేద పండితులు చెప్తారు. ఈ వ్రతాన్ని నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో త్రికరణ శుద్ధితో ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయని, పుణ్యం లభిస్తుందని పురోహితులు చెప్తారు.

విశిష్టం నదీ స్నానం

ఈ వ్రతంలో నదీ స్నానానికి ఎంతో విశిష్టత ఉంది. ఉమ్మడి పాలమూరులోని నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కృష్ణానది ప్రవహిస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ వద్ద తుంగభద్ర నది పారుతోంది. ఈ నదుల్లో పుణ్యస్నానాలు చేయడం పుణ్యప్రదమని హిందువుల నమ్మకం. అయితే నదిలో స్నానం చేసే సమయంలో సబ్బులు, షాంపులు వినియోగించొద్దు. ఎందుకంటే ఈ సమయంలో చంద్రుడి కిరణాలు సోకి నదిలోని నీటిలో ఔషధీయ శక్తులు ప్రవేశిస్తాయని, అందుకే సూర్యోదయానికి ముందే స్నానం చేయాలి. సంకల్పంతో నదీ స్నానం చేయాలని, అప్పుడే పుణ్యఫలం దక్కుతుందని అంటున్నారు. పురుషులు నదిలో ప్రవాహానికి అభిముఖంగా, స్త్రీలు వాలుముఖంగా స్నానం చేయాలి. స్నానం అనంతరం శక్తి కొద్దీ దానధర్మాలు చేయాలని చెప్తున్నారు.

విశేష ఫలం



నెల రోజుల పాటు సూరోదయం లోపు, బ్రహ్మీ ముహూర్తంలో కార్తీక స్నాన వ్రతం ఆచరించడం వల్ల విశేష ఫలం లభిస్తుంది. శక్తి పీఠంతో పాటు అన్ని ఆలయాల్లో వేకువజామునే కాకడహారతితో విశేష పూజలు నిర్వహిస్తారు.

- స్వామి శాంతానంద పురోహిత్
శక్తిపీఠం, నారాయణపేట

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- 1,44,868 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా తుంగభద్ర, కృష్ణా నదులకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. మంగళవారం శ్రీశైలం జలాశయానికి 1.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతోంది. కృష్ణా ప్రాజెక్టులలో ఒకటైన నారాయణపూర్‌కు 48 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 40 వేల క్యూసెక్కులను జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా మూడు గేట్లు ఎత్తి 21,528 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38,155 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 35 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 5 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సుంకేసుల బ్యారేజీకి 65,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 63,630 క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 1,44,868 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66,067 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ పోటీలు

- పట్టణంలోని ఇండోర్ స్టేడియం, సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియాల్లో నిర్వహణ



పోటీలో తలపడుతున్న మహబూబ్‌నగర్, మెదక్ జట్లు

గద్వాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలుర లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. పట్టణం లోని ఇండోర్ స్టేడియం, సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలలో ఈ పోటీలను నిర్వహిస్తు న్నారు. రెండవ రోజు మంగళవారం ఇండోర్ స్టేడియంలో మొదటి మ్యాచ్ ఖమ్మం, మెదక్ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 70 పరుగులు చేయడంతో ఖమ్మం జట్టు విజయం సాధించింది. ఆ తర్వాత మహబూబ్‌నగర్ - వరంగల్ మధ్య జట్ల మధ్య జరిగిన పోరులో మహబూబ్‌నగర్ జట్టు పది ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 76 పరుగులకు ఆలౌట్ అవడంతో, మహబూబ్‌నగర్ జట్టు గెలుపొం దింది. మూడవ మ్యాచ్‌లో ఖమ్మం - హైదరా బాద్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసి, విజయం సాధించింది. నాలుగవ మ్యాచ్‌లో మహబూబ్ నగర్ - మెదక్ మధ్య జట్ల పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు రెండు వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసి ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలయ్యింది.

సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో మొదటి మ్యాచ్ నల్గండ - నిజామాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు నిర్ణీత పది ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ జట్టు పది వికెట్ల నష్టానికి 58 పరుగులు సాధించగా, నల్గొండ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్ రంగారెడ్డి - అదిలాబాద్ జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. అనంతరం అదిలాబాద్ జట్టు పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేయగా, రంగారెడ్డి జట్టు గెలుపొందింది.

మూడవ మ్యాచ్ నల్గొండ - రంగారెడ్డి జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు నిర్ణీత పది ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 73 పరుగులు సాధించింది. అనంతరం రంగారెడ్డి జట్టు పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 72 పరుగులు సాధించగా, నల్గొండ జట్టు గెలుపొందింది. నాల్గవ మ్యాచ్ నిజామాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. ఈ పోరులో మొదటి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ పది ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. కరీంనగర్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి విజయం సాధించింది. సాయంత్రం జరిగిన ఐదవ మ్యాచ్‌లో కరీంనగర్ - రంగారెడ్డి జట్లు తల పడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి జట్టు పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. అనంతరం కరీంనగర్ జట్టు 84 పరుగులకు ఆలౌట్ కావడంతో రంగారెడ్డి జట్టు విజయం సాధించినట్లు కన్వీనర్ శ్రీనివాసులు వెల్లడించారు.

వైద్య విద్యార్థుల నిరాహార దీక్ష

- కోల్‌కతా ఘటనపై విచారణలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళన



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతా ఘటనపై విచారణలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని జూనియర్ డాక్టర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. జూనియర్ డాక్టర్లు అభిలాష్, అభిషేక్, కావ్య ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యాచార బాధితురాలి కుటుంబానికి ఇప్పటి వరకు న్యాయం జరగలేదని విమర్శించారు. నిందితులను శిక్షించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అందుకు నిరసనగా ఆర్‌జీ కళాశాలలో కొందరు జూనియర్ డాక్టర్లు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారు ఐసీయూలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా సత్వర న్యాయం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని విచారణను వేగవంతం చేసి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. దీక్షకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, డాక్టర్ బాలశ్రీనివాస్ మద్దతు తెలిపారు.

అద్దె చెల్లించలేదని బడికి తాళం

- పాఠశాల ముందు విద్యార్థుల పడిగాపులు
- మహబూబ్‌నగర్‌లో ఘటన



తాళం వేసి ఉన్న గేటు, పాఠశాల ముందు పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అద్దె చెల్లించడం లేదని భవనం యజమాని గురుకుల పాఠశాలకు తాళం వేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. న్యూటౌన్‌లోని మైనార్టీ బాలురు-2 రెసిడెన్సియల్ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వం 10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో మంగళవారం భవనం యజమాని పాఠశాలకు తాళం వేశాడు. దీంతో దసరా సెలవుల్లో ఇళ్లకు వెళ్లి వచ్చిన విద్యార్థులు బడి బయట పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ విషయంపై భవనం యజమానికి 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా, గత ఏడాది నుంచి తమకు అద్దె చెల్లించలేదని ఆయన తెలిపారు. దీనిపై ప్రభుత్వ గురుకుల విద్యాలయాల ప్రైవేటు భవన యాజమాన్యాల ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇచ్చినా, స్పందన లేదన్నారు. అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. 48 గంటల్లో నాలుగు నెలల అద్దె బకాయిలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత భవనం యజమాని తాళం తీయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మహబూబ్ సుభానీ గంధోత్సవం



మరికల్‌లో నిర్వహించిన గంధం ఊరేగింపులో ముస్లింలు

మరికల్/మద్దూర్/మక్తల్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మరికల్, మద్దూర్ మండలాల్లో మహబూబ్ సుబానీ గంధం మహోత్సవాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మరికల్‌లో సోమవారం రాత్రి భక్తులు హజరత్ మహబూబ్ సుబానీ గంధాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి హాజరై స్వామివారి గంధాన్ని తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మతిన్, గౌరైఖాజ, మహబుబ్‌అలీ, మహిళలు, యువకులు పాల్గొన్నారు. అదేవిదంగా, మద్దూర్, దంగాన్‌పూర్‌లలో వెలసిన దర్గాలో గ్రామ ప్రధాన వీధుల గుండా గంధోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు.

మద్దూర్‌లో మహబూబ్‌ఖాన్ అనే భక్తుడు అజ్మీర్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన చాదర్‌ను స్వామివారికి సమర్పించారు. దంగాన్‌పూర్, నాగిరెడ్డిపల్లిలలో ఇంటింట గ్యార్మీలు నిర్వహించారు. అన్నదానం చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. దంగాన్‌పూర్‌లో కులమతాలకతీతంగా పెద్ద ఎత్తున గంధోత్సవంలో పాల్గొన్నారు.

మక్తల్ పట్టణంలోని షరిఫా మసీద్ నుంచి హజరత్ మహబూబ్ సుబానీ దర్గా గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి

ఆంధ్రజ్యోతితో ఆత్మకూరు ఎస్ఐ నరేందర్



ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ.. ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్య టిస్తూ.. శాంతి భద్రత లను అదుపులోనే ఉంచామని ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ఇసుక తరలిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిని గుర్తిస్తున్నా. ఇది వరకే కొంతమంది ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారా?

13 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే అవగాహన కల్పించాం. అన్ని గ్రామాల్లో దాతలు ముందుకు వస్తే.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు సాధ్యమవుతుంది.

డ్రంకెన్ డ్రైవ్ నివారణపై అవగాహన కల్పిస్తున్నారా?

మద్యం తాగి వాహనాలు నడపరాదని, ఇది వరకు గ్రామాల్లో అవగాహన కల్పించాం. బాలు రకు బైక్‌లు ఇవ్వకూడదని, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ... డ్రైవింగ్ చేస్తే జరిగే ప్రమా దాలపై అవగాహన కల్పిస్తున్నాం.

సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నేటి కంప్యూటర్ కాలంలో సైబర్ నేరగాళ్లు మరింత రెచ్చిపోయి బ్యాంకు అధికారుల మంటూ తమ ఆధార్ కార్డు, ఓటీపీ నంబర్ చెప్పాలని ఫోన్ ద్వారా అడుగుతుంటారు. అ లాంటి ఫోన్లకు స్పందించవద్దని తెలియజేస్తున్నాం.

పౌర హక్కుల దినోత్సవాలు నిర్వహిస్తున్నారా?

ప్రతి గ్రామంలో నెల చివరి వారంలో రెవెన్యూ అధికారులతో కలిసి పౌర హక్కుల దినో త్సవం నిర్వహిస్తున్నాం. అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి వంటివి పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

మండలంలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంది?

ఆత్మకూరు మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామాలకు ఒక్కో కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి రోజు వారీగా గ్రామాల్లో పర్యటించి శాంతిభద్రతల విషయమై నిఘా ఉంచాలని ఆదేశాలు జారీ చేశాం.

దాడి హేయమైన చర్య

ఖిల్లాఘణపురం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి కతాల్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. కడ్తల్ టోల్ గేట్ వద్ద సంజీవ్ యాదవ్, అతని అనుచరులు వడ్డెర సంఘం నాయకుడిపై దాడి చేసి గాయపరచడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. మంగళవారం కతాల్‌ను పరామర్శించి దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వెంకటయ్య, గణేష్, మ ల్లేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

గోపాల్‌పేట. అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలం నుంచి భారీ ఎత్తున యువకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం తాడిపర్తిలో బీఆర్ఎస్‌కు చెందిన యువకులు కార్యకర్తలు వంశీకృష్ణ ఆధ్వర్యంలో లోకారెడ్డి, చంద్రయ్య, సమక్షంలో వనపర్తిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ యువతీ, యువ కులకు ఉద్యోగులు, ఇవ్వకుండా యువ కులను హమాలీ పని చేసుకొని బతుకుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో పెద్దపీట వేస్తుందని అన్నారు. సత్యశీలా రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు చేయాలి

ఆత్మకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : అక్టోబర్ చివరి వారం నాటికి గ్రామాల్లో ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు పూర్తి చేయాలని ఆత్మకూరు ఎంపీడీవో సుజాత పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఇంటి పన్ను నీటి పన్ను వసూలు పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లోని నర్సరీ ప్లాంట్లలో పదివేలకు తగ్గకుండా మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీరామ్ రెడ్డి, ఏపీవో విజయ భాస్కర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి

ఆత్మకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ అయ్యప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఆత్మకూరు మార్కెట్ యార్డులో మంగళ వారం వెల్డింగ్ కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం టీయూసీఐలో విలీనం అవుతున్న సందర్భంగా ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్మికులు సుదర్శన్ చారి, ఆంజనేయులు, రమేష్, అమీర్, మహమూద్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ఉట్టిదే..

- రూం అద్దె చెల్లించకపోవడంతో నిలిపివేత
- ప్రారంభించాలని కోరుతున్న యువతీ యువకులు



వృథాగా ఉన్న కంప్యూటర్లు

గోపాల్‌పేట. అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో ప్రతీ యువతి, యువకులకు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం. పల్లెలు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ సంస్థ స్వామి రామానంద తీర్థ కంప్యూటర్ గ్రామీణ సంస్థ వారు 2009లో ప్రారంభించారు. ప్రారభం కోసమని మండల కేంద్రంలో ఒక గది అదె తీసుకొని ఇరవై కంప్యూటర్లు విద్యార్థులకు ఏర్పాటు చేశారు. 2009 నుంచి 2016 వరకు సుమారు రెండువేల మంది విద్యార్థులకు పైగా ఎమ్మెస్ ఆఫీస్, ఎక్సెల్, పీజీడీసీఏ, కోర్సులో శిక్షణ పొందారు. మండల కేంద్రంతో పాటు ఉమ్మడి మండలాలకు సంబంధించిన అన్ని గ్రామాల విద్యార్థులు ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కోర్సులో శిక్షణ పూర్తి చేసిన వారు దాదాపు చాలా మంది విద్యార్థులు హైదరాబాద్, బెంగళూరు, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మరికొందరు స్వయంగా మీసేవ, ఇంటర్‌నెట్, పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నారు. గదికి అద్దె చెల్లించకపోవడంతో వస్తుతం కంప్యూటర్ శిక్షణ కేంద్రం మూతపడింది. కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభమైతే.. వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొంది పేద కుంటుంబాల విద్యార్థులకు ఓ ఆధారం తోడై స్వయంగా బతుకుతారని తెలియజేస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రం తెరిపించేందుకు నాయకులతో మాట్లాడి, తెరిపించేందుకు సిద్ధంగా ఉన్నామని, స్వామి రామానంద తీర్థ సంస్థ వారు స్పందించి ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు, యువకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు మేలు



ఉచిత కంప్యూటర్ శిక్షణతో పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కోర్సులతో పేద కుంటుంబాలకు చెందిన విద్యార్థులకు ఓ ఆధారం తోడై స్వయంగా బతుకు తారు. అధికారులు, నాయకులు స్పందించి కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తే బాగుంటుంది.

- శివ, యువకుడు

నాయకుల దృష్టికి తీసుకెళ్లాం..



ఎంతో మంది పేద విద్యార్థులకు స్వయం ఉపాధిగా నిలుస్తున్న ఈ కంప్యూటర్ శిక్షణను త్వరలోనే ప్రారంభిస్తాం. ఈ సమస్యను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయనే స్వయంగా వచ్చి శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. త్వరలోనే కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

- లక్ష్మణ్, నాయకులు

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం

ఖిల్లాఘణపురం, అక్టోబరు15: దేశంలో అవినీతి రహిత పాలన కేంద్రంలోని బీజేపీకే సాధ్యమని బీజేపీ జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జ్ నరేందర్ రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో బీజేపీ సభ్యత్వానికి అపూర్వ స్పందన లభిస్తుం దని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతులు, మహిళలు, యువకులు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వం నమోదు చేయించుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, రాకాసి అరవింద్ రెడ్డి, సత్యం, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మండల అధ్యక్షుడిగా రాంచందర్

బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడిగా చిట్యాల రాంచందర్‌ను నియమిస్తూ.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ నియామక పత్రం అందజేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీజేపీ ఓబీసీ కార్యకర్తల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల స్థాయిలో బీజేపీ బలోపేతానికి చేసిన సేవలను గుర్తిస్తూ.. మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసి నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఓబీసీ మండల అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడారు. బీసీ కులస్తులను ఏకం చేసి బీజేపీకి బీసీలు అండగా నిలిచేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న రాంచందర్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వంద మంది కార్మికులు సీఐటీయూ యూనియన్‌లో చేరారు. సమావేశానికి పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... మోటార్ వెహికల్ యాక్ట్ రద్దు చేయాలని, భారత న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్లను దోషులుగా చిత్రీకరిస్తూ.. జరిమానాలు విధిస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు రాములు, మోహన్, కృష్ణ, రామకృష్ణ, కృష్ణయ్య, కరుణాకర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి

వీపనగండ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి మద్దిలేటి కోరా రు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా్ ్లడారు. ఈ సభకు మాలలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయా లని కోరారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రివ్యూ పిటీషన్లను కొట్టివేయడం ప్రజాస్వామ్యం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ సహదేవుడు, మాల ఉద్యోగ సంఘం నాయ కులు జెట్టి వెంకటస్వామి, రామేశ్వరరావు, వీరయ్య, నాగమణి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బ తీస్తే కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : హిందువుల మనోభావాలను దెబ్బ తీసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. హిందూ వాహిని ఆధ్వర్యంలో ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్‌లో దుర్గామాత విగ్రహాలను ధ్వంసం చేసి హిందూ దేవాలయాలపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం దుండగుల దిష్టి బొమ్మ దహనం చేశారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మకూరు పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో హిందూ వాహిని వనపర్తి జిల్లా సంపర్క్ అశోక్, నందు, మాసన్న, మనోహర్ గౌడ్, తమ్మలి విజయ్, సూరి, సమ్మద్, ఆంజనేయులు, అశోక్, తిమ్మప్ప పలువురు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

పెబ్బేరు ,అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి ఎమ్మెల్యేపై ప్రభుత్వ అధికారులపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పెబ్బేరు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. సంత స్థలం విషయంలో పూజారులకు ప్రభుత్వ అధికారులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై హై కోర్టు వెలువరించిన కాపీని ఆదరంగా చేసుకుని అందులో ఉన్న విషయాన్ని వక్రీకరించి సంత స్థలం పూజారులకే దక్కేలా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అధికారులు లిఖితపూర్వకంగా హైకోర్టుకు రాసి ఇచ్చారని ఎలాంటి ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తగదని, తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ సాగర్, నాయకులు దయాకర్ రెడ్డి, సర్పంచ్ రవికుమార్ యాదవ్, గంధం రంజిత్ కుమార్, గంధం రాజశేఖర్, యుగంధర్ రెడ్డి, శివ సాయి, మోతే రాములు, సత్యనారాయణ, రాములు, సత్యరెడ్డి ఉన్నారు.

జమిలీ ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

మదనాపురం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : జమిలీ ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, దానిని వ్యతిరేకిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, ధరలను తగ్గించాలని అన్నారు. దేశంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారోద్యమం నిర్వహించాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావొస్తున్నా రైతులకు రైతుబంధు ఇవ్వడం లేదని అన్నారు. ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వెంకట రాములు, నాయకులు మణివర్ధన్, ప్రసాద్, విష్ణు, చెన్నయ్య, సత్యనారాయణ, లక్ష్మన్న, మొగిలి పాల్గొన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి

అమరచింత, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఈర్లదిన్నెలో నిర్వహించిన సమావేశంలో ఆయన రైతునుద్దేశించి మాట్లాడారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి వచ్చేలా రైతులు ఆధునిక పద్ధతిలో పంట సాగు చేయాలన్నారు. వరి పంటపై సుడిదోమ బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, నివారణ జాగ్రత్తలను అధికారులను అడిగి తెలుసుకోవాలని, యాసంగిలో నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

పెబ్బేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో మోండా మార్కెట్‌లో కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని, విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెబ్బేరు మండల అధ్యక్షుడు ఎండీ అప్రోచ్ డిమాండ్ చేశారు. నిందితులకు సరైన శిక్ష పడేలా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం పార్టీ జనరల్ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ మస్తాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయరాజ్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూరులోని పదో వార్డులో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పాలక మండలి

ఆత్మకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సాధించడం సాధ్యమవుతుందని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. ట్యూస్ డే డ్రై డే సందర్భంగా పట్టణ కేంద్రంలోని పదో వార్డులో మంగళ వారం శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ... వర్షా కాలం కారణంగా వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిలిచి పోయి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పరిస రాల శుభ్రత పాటించాలని సూచించారు. అదే విధంగా రోజు వారీగా వాడే నీటిని వేడి చేసుకుని తాగాలని తెలియజేశారు. కార్య క్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్, వైస్ చైర్మన్ విజయ్ భాస్కర్‌రెడ్డి, మునిసిపల్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, కౌన్సిలర్ తబస్సుమ్ బేగం, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్‌పి లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్ : మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పాన్‌గల్, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి తార శశాంక్, హెల్త్ అసిస్టెంట్స్ రాంచందర్, మదన్‌గోపాల్, దేవి, పంచాయతీ అధికారి నీలిమలు పలు సూచనలు, సలహాలు ఇస్తూ.. అవగాహన కల్పిచారు. ఆంజనేయులు, చిన్నమ్మ, సంధ్య, కవిత, ప్రమీల, పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అమరచింత, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని ఆయా వార్డుల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయా వార్డుల్లో మునిసిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌తో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు.

కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి



కొత్తకోటలో నివాళి అర్పిస్తున్న నాయకులు



వనపర్తిలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

వనపర్తి టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

వనపర్తి అర్బన్ : అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలాం చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిరాడంబరుడు అబ్దుల్ కలాం అని, రాష్ట్రపతి వంటి అత్యున్నత హోదాలో ఉన్న సాధారణ జీవితం గడిపారని అన్నారు. మాణిక్యం, గులాం ఖాదర్ ఖాన్, సూర్యవంశం గిరి, సునీల్ వాల్మీకి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట : మండలంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గ్రంథాలయంలో కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కనిమెట్ట పల్లె ప్రకృతి వనంలోని కలాం విగ్రహానికి యువకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ గ్రంథాలయ అధికారి తాజోద్దీన్ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, పరమేష్, వెంకటేష్, నరేష్, మస్తాన్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్ : కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని 30వ వార్డు ఐజయ్య కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కలాంకు నివాళి అర్పించారు. శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- టీజేఏసీ, మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏపీజే అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిరాజాచారి, గంధం నాగరాజు, దేవన్న నాయుడు, బాలేమియా, నరసింహ పాల్గొన్నారు.

పెబ్బేరు : పట్టణంలో ఎంఐఎం పార్టీ కార్యాలయంలో కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమీర్, మస్తాన్, జయరాజు, హాజీ మస్తాన్ ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రేవల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బండరాయిపాకులకి చెందిన దుస్తు బక్కయ్య, నాగమ్మ దంపతులు శుక్రవారం సాయం త్రం శీతాఫలాలకు వెళ్లి ప్రమాద వశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందారు. కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఆర్థిక సాయం అందజేశారు. వారితో మాట్లాడారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండే తల్లిదండ్రులు మృతి చెందారని, కుటుంబ సభ్యులు ఆదెరువు కోల్పోయారని, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెలేకు వివరించారు. అనంతరం అదే గ్రామంలో పోచయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పర్వతాలు, సత్యశీలరెడ్డి, సురేష్ గౌడ్, బాల్‌రెడ్డి, స్వామి, శేఖర్ రావ్ పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వనపర్తి టౌన్ : పట్టణంలోని 10వ వార్డు నాగవరానికి చెందిన కృష్ణయ్య గతంలో విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఇందుకు సంబంధించి విద్యుత్ శాఖ నుంచి రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయించారు. మంగళవారం చెక్కును కౌన్సిలర్ జయసుధ మధుగౌడ్ సమక్షంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోండి

వనపర్తి రూరల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : మీ ఫోన్లను మీరు జాగ్రత్తగా ఉంచుకోవాలని రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో మొబైల్ పోగొట్టుకున్న బాధ్యులకు రికవరీ చేసిన ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫోన్లు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఒకరి ఫోన్లు ఒకరికి ఇవ్వకూడదని అన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు.

సేవా గుణం ఉండాలి



మన్యంను సన్మానిస్తున్న వైద్యులు

వనపర్తి వైద్య విభాగం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో తోటి వారికి సాయం చేయాలనే గుణం ప్రతీ ఒక్కరిలో ఉండాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు అన్నారు. ఇటీవల మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛంద రక్తదానం ఏర్పాటు చేసి 32 మందితో రక్తదానం చేయించిన ప్రేమ్ టైలర్ నాగనమోని మన్యంను మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తన కూతురు కావేరి గీసిన మహాత్ముడి చిత్రపటాన్ని వైద్యులకు బహూకరించారు. డాక్టర్ శివప్రసాద్, గౌరీ దేవి, వాకిటి రమేష్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

వనపర్తి టౌన్ అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని వాల్మీకి సంఘం నాయ కులు ఎమ్మెల్యే మేఘారెడ్డికి వినతిపత్రం అందజే శారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిని క లిసిన వాల్మీకి సంఘం నాయకులు వినతి అంద జేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, శంకర్ ప్రసాద్, కౌన్సిలర్ బ్రహ్మ చారి, వాల్మీకి సంఘం నాయకులు నారాయణ, రాములు, దేవన్న నాయుడు, నాయుడు, రవి, విష్ణు పాల్గొన్నారు.

జ్వర పీడిత సర్వే తనిఖీ

గోపాల్‌పేట. అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని జిల్లా అదనపు వైద్య అధికారి బి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని పొలికేపాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న జ్వరం పీడిత సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, వ్యాధులు రాకుండా ప్రతీఒక్కరు తమ చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల వాన నీరు నిలువకుండా చూసుకోవాలని తెలియజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మురికి క్వాలను శుభ్రం చేస్తూ.. వాటిపై బ్లీచింగ్ చేయాలని అన్నారు. వైద్య సిబ్బంది పకడ్బందీగా జ్వరం పీడిత సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో కుమారస్వామి, శ్రీనివాస్, సిద్దగౌడ్, సూచిత్ర, సుమిత్ర, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఆత్మకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన శశిధర్‌ను మునిసిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది మంగళశారం మునిసిపల్ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం నూతన కమిషనర్ శశిధర్ మాటాడుతూ.. ఆత్మకూరు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పురపాలక సమావేశం ఏర్పాటు చేసి, ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్లను, ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు చెన్నయ్య, మహేశ్వరి, అశ్విన్ కుమార్, పోషన్న, యాదమ్మ, నాగలక్ష్మి రెడ్డి, రామకృష్ణ, తబస్సుమ్ బేగం, కోఆప్షన్ సభ్యులు కిషన్ చంద్ పాల్గొన్నారు.

కేసు నమోదు

పెబ్బేరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం పెబ్బేరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి ప్రకారం గుమ్మడం తండా గ్రామ పరిధిలో రవీందర్ తన ఇంటి ముందు వీధి లైట్లు వెలగడం లేదని గ్రామానికి విద్యుత్ సరఫరా బంద్ చేశాడు. ఈ విషయంపై గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి రాజబాబుకు తెలియజేశారు. బుధవారం ఉదయం గ్రామ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. రాత్రి సమయంలో వీధి లైట్లకు విద్యుత్ సరఫరా ఎందుకు బంద్ చేశావని అడగగా మాజీ సర్పంచ్ రంగదాసుపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు వెళ్లిన పంచాయతీ సిబ్బందిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యార్వీ వేడుకలు ప్రారంభం

అమరచింత, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు కొనసాగే గ్యార్వీ పర్వదిన వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా ఈ నెల రోజులు మహబూబ్ సుహాని దర్గాకు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించి గ్యార్వీ పండుగను చేస్తారు. ఈ నెలలో అన్నదానం చేయడంతో పాటు గౌసేపాక్ స్మరించుకుంటూ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మసీదుల్లో గ్యార్వీ నెలను పురస్కరించుకుని ప్రత్యేక సదస్సులు గజల్ నాతే షరీఫ్ లాంటి కార్యక్రమాలను చేపడతారు. ఈ నెలలో అన్నదానం చేయడం పుణ్యకార్యమని మౌలానాలు పేర్కొంటున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

శ్రీరంగాపురం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని శ్రీరంగాపురం గ్రామంలో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆరు రోజులు అట్టహాసంగా జరిగిన క్రికెట్ పోటీల్లో యముజకర్ ప్రథమ, ద్వితీయ బహుమతి ఆనామ్ టీంకు దక్కింది.



ప్రథమ బహుమతి పొందిన క్రికెట్ జట్టు